
# సత్యవాక్కు

సంపుటి - 44    సెప్టెంబర్ - 2022    సంచిక - 2



## క్రైస్తవ మాసపత్రిక

సెప్టెంబర్ - 2022

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు
## సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| మంగళవారం మధ్యాహ్నం | : | 3.00 గం॥లకు నిరీక్షణ ఛానల్‌లో |
| బుధవారం ఉదయం | : | 7.30 ని॥లకు నిరీక్షణ ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం<br>రిక్కీ గూటం<br>రోసీ గూటం |

Youtube లో satyavanicoc.kkd లో
పై కార్యక్రమములను చూడండి
మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.
ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

### సెప్టెంబరు నెల విషయ సూచిక


1. యేసుక్రీస్తు దేవుడు - మానవుడు - పేజీ 3
2. సువార్త మానవులను రక్షించుచున్నదా? 10
3. ఆయన రక్తము మామీద ఉండునుగాక 15
4. పరిశుద్ధాత్మ బాప్తిస్మము - నీటిబాప్తిస్మము 16
5. తన సంఘమునకు, శరీరముకు, యింటికి, శిరస్సయిన యేసుక్రీస్తు 18



**సత్యవాణి**
పోస్ట్ బాక్స్ నెం. 80, కాకినాడ
పిన్ : 533004. ఫోన్ నెం. : 0884 - 2363722
98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్: జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 44 సెప్టెంబరు - 2022 సంచిక -2


## యేసు క్రీస్తు దేవుడు - మానవుడు

యేసుక్రీస్తు ఈ లోకమందుండగా దేవుడై యున్నారని గతపాఠంలో నేర్చుకొని యున్నాము. ఆయన ఆది నుండియు దేవుడై యున్నారు, పాత నిబంధనలో మనకు కనబడుచున్న దేవుడు యేసుక్రీస్తే. ఆయన మొదటి వాడును కడపటివాడునైన యెహోవా దేవుడు. హెబ్రీ భాషలో మొదటి అక్షరము 'ఆలెఫ్', ఆలెఫ్ అనగా మొదటి వాడునైన దేవుడు, ఆఖరి అక్షరము. తౌ అనగా సిలువ (క్రాస్) అని అర్థము. మొదటివాడు కడపటివాడనుటలో ఆయన సిలువవేయబడిన దేవుడనే భావము హెబ్రీ పండితులకు ఎరుకయే ఆయన మార్పులేనివాడు. నిన్న, నేడు, నిరంతరము ఒకేరీతిగాయున్న దేవుడు. అవును యుగ యుగములకు ఒక్కటే రీతిగా యుండును (హెబ్రీ 13:8).

ఈ లోకములో మానవావతారియై యుండగా తాను దేవుడనని అనేకరీతులుగా ఆయన ప్రజలకు నిర్ధారణయిచ్చారు. ఆయనను నమ్మిన వారిలో ఆయన యొక్క దైవత్వాన్ని గూర్చి యిసుమంతయును సందేహము లేదు. ఆయన దేవుడైయుండియు మనుష్యరూపము ధరించి, దాసునిగా తన్నుతాను ప్రత్యక్షపరచుకొనెను (ఫిలిప్పీ 2:5-8). ఆయన మానవావతారియై ఈలోకమునకు వచ్చి మానవుల పాపపరిహారార్థ బలిగా

అర్పించుకొని మానవులను తిరిగి దేవుని యొద్దకు చేర్చే మార్గము ఏర్పరచవలెనని జగత్తుపునాది వేయబడకముందే తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మలు ఏకమై సంకల్పించిరి (ఎఫెసీ 1:7).

"ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి దేవునితో సమానునిగా ఉండుట విడిచిపెట్ట కూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యులపోలికగా పుట్టి దాసుని స్వరూపము ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి మరణముపొందునంతగా, అనగా సిలువ మరణము పొందు నంతగా విధేయతచూపినవాడై తన్ను తాను రిక్తునిగా చేసికొనెను" (ఫిలిప్పీ 2:5-8).

నిజమే యేసుప్రభువు దేవుడే గాని మానవుల రక్షణార్థమై మానవు డయ్యారు. ఆయన ఈ లోకంలో సంచరించినప్పుడు ఎంత దేవుడో అంత మానవుడు కూడాను. ఆయన ఒక్కడే నూటికి నూరుపాళ్లు మానవుడు, నూటికి నూరుపాళ్లు దేవుడైయున్నారు.

మానవునివలె ఆయన సంతోషాన్ని, దు:ఖాన్ని, బాధలను, శోధనలను, ఆకలిని, దాహమును, దారిద్ర్యమును అనుభవించారు. మనందరివలె ఆయన స్త్రీకి జన్మించారు (ఆది.కా. 3:15; గలతీ 4:4). ఆయన యిష్టపూర్వకముగా మానవత్వాన్ని ధరించుకొన్నారు. "ఆ వాక్యము శరీర ధారియై కృపాసత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను" (యోహాను 1:14). "కాబట్టి ఆయన ఈ లోకమందు ప్రవేశించునప్పుడు ఈలాగు చెప్పు చున్నాడు: బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నాకొక శరీరమును అమర్చితివి. పూర్ణ హోమములును, పాపపరిహారార్థ బలులును నీకిష్టమైనవి కావు. అప్పుడు నేను గ్రంథపుచుట్టలో నన్ను గూర్చి వ్రాయబడిన ప్రకారము దేవా, నీ చిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నాననంటిని" (హెబ్రీ 10:4-6). ఆయనకొక శరీరము అమర్చ బడెను. అది మానవశరీరము. జన్మత: ఆయన మానవుడు, తాను పెరిగిన రీతిలో మానవుడు. "యేసు

జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయయందును, మనుష్యుల దయయందును వర్ధిల్లుచు" పెరిగెను (లూకా 2:52).

**ఆయన మానవుల సంతోషములో పాల్గొనెను :** ఆయన కానాయను వూరిలో జరిగిన వివాహమునకు ఆహ్వానితుడు కాగా తన తల్లితో ఆ వివాహమునకు వెళ్లి వారి సంతోషములో పాల్గొనెను. అయితే ఆ పెండ్లిలో ద్రాక్షారసము అయిపోగా నీళ్లను ద్రాక్షారసముగా మార్చి తాను దేవుడనని నిరూపించుకొనెను. మనము పాప విముక్తి పొంది మన సంతోషము పరిపూర్ణముకావలెనని ఆయున మానవుడాయెను (యోహాను 15:11). కుష్టరోగియైన సీమోను యింట ఆయన భోజనము చేసి అతని ఆనంద మునకవధులు లేకుండా జేసెను (మార్కు 14:3; మత్తయి 26:6,7).

**ఆయన మానవుల దు:ఖములో పాలిభాగస్థుడాయెను :** తన మిత్రుడైన లాజరు చనిపోగా అతని సమాధి దగ్గరకు వచ్చి అతని గూర్చి ఆయన యేడ్చెను (యోహాను 11:35). ఒక మానవునివలె తన మిత్రుని మరణ మును గూర్చి ఆయన యేడ్చినను, అప్పటికే నాలుగు దినములు సమాధి చేయబడి కుళ్లిపోవు చున్న అతని మృతశరీరమునకు జీవము పోసెను. ఆయన ప్రార్థనచేసి "లాజరూ బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా చనిపోయిన వాడు కాళ్లు చేతులు ప్రేతవస్త్రములతో కట్టబడిన వాడై వెలుపలికి వచ్చెను" (యోహాను 11:43,44). ఆయన చేసిన కార్యమును చూచిన యూదులలో అనేకులు ఆయన యందు విశ్వాస ముంచిరి (యోహాను 11:45). యేసు తన మిత్రుడైన లాజరు చనిపోగా ఏడ్చుటయే గాక, యెరూషలేము పట్టణమును గూర్చి యేడ్చెను (మత్తయి 23:37, 38).

**యేసు ఆకలిగొనెను :** యోహాను చేత ఆయన బాప్తిస్మము పొందిన తరువాత నలువది దినముల మట్టుకు ఆయన ఉపవాసముండెను. "నలువది దినములు నలువది రాత్రులు ఉపవాసముండిన పిమ్మట ఆయన ఆకలిగొనగా..." (మత్తయి 4:2). ఆయన మానవుడే గనుక

సహజముగా ఆకలిగొనెను. నిజానికి జీవాహారము నేనే అని ఆయన తన్ను తాను పరిచయము చేసికొనెను (యోహాను 6:48-57). మానవుని వలె ఆకలిగొనినను దేవునివలె వేల కొలది జనులకు ఆహారమును సృజించి యిచ్చెను.

ఒకప్పుడు "ఉదయమందు పట్టణమునకు మరల వెళ్లుచుండగా ఆయన ఆకలిగొనెను" (మత్తయి 21:18). అప్పుడు త్రోవప్రక్కన ఉన్న అంజూరపుచెట్టు యొక్క ఫలముల తిననాశించగా దానియందు ఆకులు తప్ప మరేమియు కనబడలేదు. గనుక ఆయన దానిని శపింపగా ఆ చెట్టు త్వరగా ఎండిపోయెను. మానవునివలె ఆకలిగొనినను, దేవుని వలె ఆ చెట్టును శపించెను (మత్తయి 21:18-20). మరొక సందర్భములో ఆయన పునరుత్థానుడైన తరువాత తన శిష్యులలో కొందరిని కనుగొని "పిల్లలారా, భోజనమునకు మీ యొద్దఏమైనా ఉన్నదా? అని వారిని అడుగగా లేదని వారయనతోచెప్పిరి". తదుపరి ఆయన చెప్పినచోట వారు వలవేయగా విస్తారమైన చేపలు పట్టిరి. యేసువారితో కలిసి భోజనము చేసెను (యోహాను 21:5-14).

**యేసు దప్పిగొనెను :** సమరయ స్త్రీ యొకతె బావి యొద్దకు రాగా యేసు "నాకు దాహమున కిమ్మని ఆమెనడిగెను" (యోహాను 4:7). సిలువపై వ్రేలాడుచు "నేను దప్పి గొనుచున్నాననెను" (యోహాను 19:28). ఆయన మానవుని వలె ఆకలిగొనెను, మానవునివలె దప్పిగొనెను.

**యేసు శోధించబడెను :** అపవాది ఆయన పై శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములను అస్త్రములనుప యోగించి ఆయనను శోధించెను (మత్తయి 4 చదువండి). పరిసయ్యులు, సద్దూకయ్యులు అడుగడుగునా ఆయనను శోధించుచు వచ్చిరి. ఆయన వందశాతం మానవుడే గనుక "మన బలహీనతల యందు సహానుభవము లేనివాడు కాదుగాని సమస్త విషయములలోను మనవలెనే శోధింప బడియు **ఆయన పాపము లేనివాడుగా ఉండెను** (హెబ్రీ 4:15). శోధింప బడుట పాపముకాదు, శోధనకు లొంగి పోవుట పాపము. యేసు ఎన్ని విధములుగా శోధించ

బడినను ఆయన శోధనకు లొంగి పోలేదు, పాపము చేయలేదు. ఆయన దైవమానవుడు. మానవుల దేవుడు!

**ఆయన దారిద్ర్యము ననుభవించారు:** ఆయన ఎంత బీదవాడంటే తనకంటూ ఇల్లు వాకిలి లేనివాడుగా జీవించెను. ఒకప్పుడు శాస్త్రియైన వాడొకడు ఆయనతో బస చేయగోరగా "యేసు నక్కలకు బొరియలును, ఆకాశపక్షులకు నివాసములును కలవు గాని మనుష్యకుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలము లేదని అతనితో చెప్పెను (మత్తయి 8:19).

ఆయన భూమ్యాకాశముల సృష్టికర్తయైనను, మానవునిగా జన్మించినప్పుడొక రాజభవనములో పుట్టలేదు. బంగారు ఊయలలో గాక పశువుల తొట్టెలో పరుండబెట్టబడెను. చనిపోయినప్పుడొక అరువుతెచ్చుకొనిన సమాధిలో పాతిపెట్టబడెను. "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2 కొరింథీ 8:9).

**యేసుశ్రమలననుభవించెను :** ప్రతి సందర్భములోను శాస్త్రులు, పరిసయ్యులు ఆయనను శోధించిరి, పరిహసించిరి, "హేరోదు తన సైనికులతో కలిసి ఆయనను తృణీకరించి అపహసించి, ఆయనకు ప్రశస్తమైన వస్త్రము తొడిగించి పిలాతునొద్దకు మరలపంపెను" (లూకా 23:11). "అప్పుడు పిలాతు యేసును పట్టుకొని ఆయనను కొరడాలతో కొట్టించెను. సైనికులు ముండ్లతో కిరీటమల్లి ఆయన తల మీదపెట్టి ఆయనను అరచేతులతో కొట్టిరి, కొరడా దెబ్బలు కొట్టిరి "(యోహాను 19:1-4). "ఆ ముండ్ల కిరీటమును ఊదారంగు వస్త్రమును ధరించినవాడై యేసు వెలుపలికిరాగా పిలాతు ఇదిగో **ఈ మనుష్యుడు** అని వారితో చెప్పెను" (యోహాను 19:5).

ఒక మానవునిగా యేసు సిలువను, అవమానమును, హింసను మన కొరకు భరించెను. మరణమంటే మనకెంతభయమో ఆయన కూడ దాని విషయమై కలవరపడెను. ఆయన

ఇట్లు ప్రార్థించెను : "ఇప్పుడు నా ప్రాణము కలవరపడుచున్నది. నేనేమందును? తండ్రీ యీ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము; అయినను ఇందు కోసరమే నేను ఈ గడియకు వచ్చితిని" (యోహాను 12:27). "అయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట నేలపడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను" (లూకా 20:44). సైనికులు ఆయనను గుద్దినను, హేళన చేసినను, ముఖము మీద ఉమ్మివేసినను దానినంతటినీ ఒక మానవునివలె ఆయన సహించెను. శ్రమలను, సిలువను సహించెను. ఆయన దేవుడై యుండియు ఒక మానవునిగా ఈ పాట్లన్నియు ఎందుకు పడవలసి వచ్చెను? యోహాను 3:16. దీనికి జవాబిచ్చుచున్నది. 'దేవుడు లోకము నెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతి వాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను"

మానవుడు పాపము చేయగా పాపప్రాయశ్చిత్తార్థ బలి అవుసర మాయెను. మరియు జంతువుల రక్తము ఎట్లు పాప ప్రాయశ్చిత్తము చేయదో (హెబ్రీ 10:4), పాపియైన మానవుని రక్తము కూడ పాపప్రాయశ్చిత్తము చేయనేరదు. అందువలన పాపములేని మానవుని రక్తము మాత్రమే దానికి తగును. యేసుక్రీస్తు మానవునిగ జన్మించి, పాపము లేని మానవునిగా జీవించి సిలువపై తన పవిత్ర రక్తము చిందించి దానిని దేవునికి సమర్పించెను. "ఏలయనగా ఎంతమాత్రము దేవదూతల స్వభావము ధరించుకొనక అబ్రాహాము సంతాన స్వభావము ధరించుకొని యున్నాడు. కావున ప్రజల పాపములకు పరిహారము కలుగుటకు దేవుని సంబంధ కార్యక్రమములలో కనికరమును నమ్మకమును గల ప్రధాన యాజకుడగు నిమిత్తము అన్ని విషయ ములలోను తన సహోదరుల వంటి వాడు కావలసి వచ్చెను. తాను శోధింప బడి శ్రమనొందెను గనుక శోధింపబడు వారికిని సహాయము

చేయగలవాడై యున్నాడు" (హెబ్రీ 2:16-18).

యేసు "మేకల యొక్కయు కోడెల యొక్కయు రక్తముతో గాక తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను" (హెబ్రీ 9:12). "ఈయనయైతే పాపము నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి అప్పటి నుండి తన శత్రువులు తన పాదములకు పాదపీఠముగా చేయబడు వరకు కనిపెట్టుచు దేవుని కుడిపార్శ్వమును అసీనుడాయెను" (హెబ్రీ 10:12-13).

"ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేచియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను" (1కొరింధీ 15:20,21). "ఆయన మనుష్యు లందరు రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము కలిగిన వారై యుండవలెనని యిచ్ఛ యించు చున్నాడు. దేవుడొక్కడే, దేవునికిని, నరులకును మధ్యవర్తియు ఒక్కడే. ఆయన క్రీస్తుయేసను నరుడు" (1 తిమోతి 2:4,5).

**ముగింపు :** ఆకాశము గుండా వెళ్ళిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు గనుక మనము ఒప్పు కొనిన దానిని గట్టిగా చేపట్టుదము. మన ప్రధాన యాజకుడు మన బలహీనతల యందు మనతో సహానుభవము లేనివాడు కాదుగాని సమస్త విషయములలోను మనవలె శోధింపబడినను ఆయన పాపములేని వాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:14-16).

మనము దేవుని కుమారు లగునట్లు దేవుడే మానవుడయ్యారు. మానవునివలె జీవించి, మరణించారు. గాని మరణమును జయించి తిరిగి లేచారు. యేసుప్రభువు అప్పుడు ఇప్పుడు నూటికి నూరుపాళ్లు దేవుడు, నూటికి నూరుపాళ్లు మానవుడు!!

జాషువాగూటం

# సువార్త మానవులను రక్షించుచున్నదా? -2

మానవులందరు పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొంద లేక పోవుచున్నారని బైబిలు బోధించు చున్నది. అయితే క్రీస్తు సువార్త, నమ్ము ప్రతివానిని రక్షించుటకు దేవుని శక్తి అయ్యున్నదని కూడా బైబిలు బోధించు చున్నది. దేవుడు శక్తిగల దేవుడు. మానవులను పాపము నుండి రక్షించుటకు సువార్త ఆయన శక్తి అయ్యుండినను కూడ అందరు రక్షింప బడుటలేదు, ఏలయనగా అందరు సువార్తను నమ్ముటలేదు. కొందరు గర్వాంధులై సువార్తను నిరాకరించు చున్నారు. మరికొందరు అద్భుతముల కొరకు, సూచకక్రియల కొరకు కనిపెట్టుచున్నారు. అట్టివారు దేవుని గ్రంధమును పరిశోధించి దానిలోని సత్యవాక్యమును విశ్వసించి లోబడుట ఎంతైనా అవుసరమని గత సంచికలో తెలిసికొని యుంటిమి.

సువార్త ద్వారా తప్ప వేరే విధముగా దేవుడు తన చిత్తమును నీకు తెలియపరచునని నీవనుకొను చున్న యెడల సువార్తకును, నీహృదయము నకును మధ్య ఒక అడ్డంకము అభ్యంతరమున్నది. ఈ అభ్యంతరము వలన నీవు సువార్తను నమ్మలేక పోవు చున్నావు. నిన్ను పాపము నుండి రక్షించు దేవుని శక్తిని నీ అవిశ్వాసము వలన నిరర్ధకము చేయుచున్నావు. ఏలయనగా నమ్ము ప్రతివానికి రక్షణ కలుగుజేయుటకు దేవుని శక్తి అయ్యున్నది. "దేవుని జ్ఞానానుసారము గా లోకము తన జ్ఞానముచేత దేవుని ఎరుగ కుండినందున సువార్త ప్రకటన యను వెర్రితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను" అని అపొ.పౌలు చెప్పెను (1కొరింధి 1:21). సువార్త అందరికి వెర్రితనముగా ఎంచలేదు. మనుష్య జ్ఞానానుసారముగా నడుచు కొనువారు పౌలు ప్రకటించుచున్న దానిని వెర్రితనముగా ఎంచిరి, నిజమే.

తాను ప్రకటించుచున్న క్రీస్తు సువార్త సూచకక్రియలను వెదకువారికి ఆటంకముగా యుండెను, నిజమే. కాని ''ఆయన యూదులకు ఆటంకముగాను, అన్య జనులకు వెర్రితనముగాను ఉన్నాడు; గాని యూదులకేమి గ్రీసుదేశస్థులకేమి పిలువబడినవారికే క్రీస్తు దేవుని శక్తి యును దేవుని జ్ఞానమునై యున్నాడు" అని అపో. పౌలు 1 కొరింథీ 1:24లో చెప్పెను.

**పిలువబడినవారు :** సువార్తలో యున్న దేవుని పిలుపును మీరు గమనించగోర్తాను. యూదులకేమి, గ్రీసుదేశస్థులకేమి పిలువబడిన వారికే క్రీస్తు దేవునిశక్తియు, జ్ఞానమునై యున్నాడు. ప్రజలందరు ఆయన ప్రజలు కావలె నని దేవుడు తప్పక పిలుచుచున్నాడు. వారు రక్షింపబడు నిమిత్తము ఆయన పిలుచుచున్నాడు. ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన జనులారా, నాయొద్దకు రండి అని యేసు పిలుచుచున్నాడు (మత్తయి 11:28). దేవుని పిలుపును గూర్చి పేతురు ఇట్లుచెప్పెను: "ఈ వాగ్దానము మీకును, మీ పిల్లలకును, దూరస్థు లందరికిని అనగా మన ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారికందరికిని చెందును" (అపో.కా. 2:39).

**దేవుడు పక్షపాతి కాదు :** దేవుని పిలుపు మానవులకు ఎట్లు వచ్చును? దేవుడు మానవులను నేరుగా, అద్భుతరీతిగా పిలుచున్నా డనుకొనుచున్నావా? అట్లయిన ప్రజలు ఎందుకు నశించిపోవు చున్నారో యను దానికి జవాబు నీయలేవు. దేవుడు పక్షపాతము చూపు చున్నాడా? దేవుడు కొందరిని అద్భుత రీతిగా పిలుచుచున్న యెడల మిగతా వారి యెడల ఆయన పక్షపాతియగును గదా? అయితే దేవుడు పక్షపాతి కాదు. ప్రతిజనములోను నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించును (అపో.కా. 10:34). కాని మానవులు రక్షణ పొందు నిమిత్తము సువార్త

ద్వారా దేవుడు వారిని పిలుచుచున్న యెడల రక్షింపబడుటకు మానవులు ఆ సువార్తను నమ్ముట అవసరమైన యెడల, మనుష్యులలో కొందరు నశించిపోవుచున్నప్పుడు అది దేవుని బాధ్యతా?

అవును రక్షింపబడు నిమిత్తము దేవుడు మనుష్యులను పిలుచుచున్నాడు కాని ఈ పిలుపు సువార్తలోను, సువార్త ద్వారాను ఇచ్చుచున్నాడు. "మీరీలాగున రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని ఆయన మా సువార్తవలన మిమ్మును పిలిచెను" అని 2థెస్స 2:14లో పౌలు వ్రాసెను. దేవుడు సువార్తద్వారా మానవులను పిలుచుచున్నాడు గాని ఆయన వారిని వేరే విధముగాగాని, వేరేశక్తిద్వారాగాని పిలుచుటలేదు. అయితే సువార్త ద్వారా గాక వేరే విధముగా దేవుడు వారిని పిలుచునని కొందరు ఎదురుచూచుచున్న యెడల వారు సువార్త పిలుపును లక్ష్యపెట్టరు.

కొందరు సువార్తను ఎందుకు వినరో మరియొక కారణము మనకు కనబడుచున్నది. 2కొరింథీ 4:3,4లో పౌలు ఆ కారణమును ఇట్లు చెప్పుచున్నాడు: "మా సువార్త మరుగుచేయబడిన యెడల నశించుచున్న వారి విషయములోనే మరుగుచేయబడియున్నది. దేవుని స్వరూపియైన యున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైనవారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగుజేసెను". ఈ యుగసంబంధమైన దేవత యనగా అపవాది. ఈ అపవాదికి అనేకమంది పరిచారకులున్నారు (2కొరింథీ11:14, 15). ఈ పరిచారకులు ప్రజలను అబద్ధ బోధవలన మోసపుచ్చువారై యున్నారు.

క్రీస్తు యొక్క సువార్త దానిని నమ్మువారి నెవరినైనను రక్షించుటకు దేవునిశక్తియైయున్నది. ఏదయినను లేక ఎవడైనను ఆ సువార్తను నమ్మకుండా అభ్యంతరము ఎవనికైనను కలుగజేయుచున్న యెడల అట్టివాడు అతనికి

కలుగు ఆశీర్వాదములను దొంగిలించు వాడగును. నీ ఆత్మ యొక్క విలువ గొప్పది, గనుక సువార్తలోని వాస్తవము లను నమ్మము, దాని ఆజ్ఞలకు లోబడుము, మరియు క్రీస్తు సువార్త ద్వారా కలుగు గొప్ప దీవెనల ననుభవించుము.

**భిన్నమైన సువార్త :** సువార్తను ఉన్నది ఉన్నట్టుగా కొందరు బోధించుట లేనందున అనేకులు సువార్తను నమ్మలేక పోవు చున్నారు. గలతీయు లకు వ్రాయుచు పౌలు ఇట్లనెను : "క్రీస్తు కృపనుబట్టి మిమ్మును పిలిచినవానిని విడిచి భిన్న మైన సువార్త తట్టుకు మీరింత త్వరగా తిరిగిపోవుట చూడగా నాకాశ్చర్యమగు చున్నది. అది మరియొక సువార్త కాదు గాని క్రీస్తు సువార్తను చెరుపగోరి మిమ్మును కలవరపరచువారు కొందరు న్నారు. మేము మీకు ప్రకటించిన సువార్త గాక మరియొక సువార్తను మేమైనను పరలోకము నుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక. మేమిదివరకు చెప్పిన ప్రకారమిప్పుడును మరల చెప్పుచున్నాము; మీరు అంగీ కరించిన సువార్తగాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవునుగాక" (గలతీ 1:6-9).

దేవుని ద్వారా ఈయబడిన క్రీస్తు రక్షణ సువార్తలో నమ్ముటకు వాస్తవము లు కలవు. ఈ ప్రాథమిక వాస్తవములు 1 కొరింధీ 15:1-3లో వ్రాయబడి యున్నవి: క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను, ఆయన సమాధి చేయబడెను, మూడవ దినమున తిరిగి లేచెను. ఈ వాస్తవము లలో కొన్నిటినిగాని లేక అన్నిటినిగాని తిరస్కరించుటలో ఒకడు క్రీస్తు సువార్తను చెరుపును. క్రీస్తు మృతులలో నుండి పునరుత్థానుడు కాలేదనునది, చెరుపబడిన సువార్త!.

అయితే మానవులు విధేయత చూపించుటకు సువార్తలో ఆజ్ఞలు కూడయున్నవి. సువార్త యిచ్చు ఆజ్ఞ

లేమనగా, విశ్వాసము, మారుమనస్సు ఒప్పుకోలు, బాప్తిస్మము (మార్కు 16:15, 16; లూకా 24:46,47; రోమా 10:9,10,16). అంతే కాకుండా అనుభవించుటకు సువార్తలో వాగ్దానములున్నవి. పాపము నుండి రక్షణ, అర్థముతో కూడిన జీవితము ఇప్పుడును, పరలోకములో నిత్యజీవిత మును వాగ్దానము చేయబడినవి.

అధికారపూరితముగా యున్న సువార్త ఆజ్ఞలు సువార్త వాస్తవముల యధార్థతపై ఆధారపడియున్నవి. ఇంకొక మాటలో సువార్తలోని సంగతులు కట్టుకథలే అయినట్లయితే సువార్త ఆజ్ఞలు మానవులకు వర్తించు ఆధారమేమియును లేదు. సువార్త వాస్తవములు సత్యము కాని యెడల, దాని వాగ్దానములు కేవలము మాయయే అగును.

కాని సువార్త వాస్తవములు యధార్థములు. యేసుప్రభువు నిజముగా, ఖచ్చితముగా మన పాపము ల నిమిత్తము మృతిబొందెను. ఆయన నిజముగా, ఖచ్చితముగా మృతులలో నుండి లేచెను. గనుక రక్షింపబడుటకు మానవులు ఏమిచేయవలెనని ఆయన చెప్పెనో దానిని వారు చేయవలెను. సువార్త ఆజ్ఞలకు లోబడువారు సువార్త యిచ్చు దీవెనలకు వారసులగుదురు.

నమ్మువారిని రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది. నీవు సువార్తను నమ్ముచున్నావా? లేని యెడల యేసుప్రభువునందు విశ్వాస ముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, క్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పు కొనుము. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు క్రీస్తునందు ఈ లోకములో సంతోష మును, పరలోకములో నిత్య జీవమును నీవు వాగ్దాన రూపముగా పొందగలవు. నీవు సువార్తకు లోబడ వలెనని కోరుచున్న యెడల, నీకు సమీపముగా యున్న క్రీస్తు సంఘము మును దర్శించుము. క్రీస్తు సంఘము లన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి.

# ఆయన రక్తము మా మీద ఉండును గాక!

యూదుల నాయకులు యేసును పిలాతునొద్దకు తీసికొనివచ్చినప్పుడు అతడు ఆయనను చంపవలెనని కాంక్షించారు. అయితే యేసు మరణ శిక్షకు పాత్రుడుకాడని నిరూపించుటకు పలుమార్గములు వెదికాడు. చివరిగా వారు యేసునో లేక నరహంతకుడైన బరబ్బానో ఎంచుకోవాలని పిలాతు చెప్పాడు (మార్కు 15:7). అయితే యూదులు ప్రజలను ప్రోత్సాహించి బరబ్బానే విడుదల చేయమని కేకలు వేయించారు. పిలాతు ఆశ్చర్యపోయాడు! (మత్తయి 27:20). అయితే యేసును యేమి చేయాలని పిలాతు వారి నుండి తెలిసికొనగోరాడు.

ఆయనను సిలువ వేయుము, సిలువ వేయుము అని ప్రజలు గగ్గోలు పెట్టారు. ఆయన చంపబడాలని ప్రజలు గట్టిగా కోరుకొనుటయేగాక, "ఆయన రక్తము మా మీదను, మా పిల్లలమీదను ఉండునుగాక!"యని ఒట్టుపెట్టుకొన్నారు (మత్తయి 27:25). యిది చాల గంభీరమైన మాట. ఆయన రక్తము చిందింప బడాలని, దానికి వారేబాధ్యులని ఒప్పుకొనుచున్నట్లు రికార్డులో యుండాలని వారు కోరారు.

నిజానికి ఈ రీతిగా ఆయన రక్తము వినియోగించబడాలని యేసు కోరలేదు; అది విచారము. ఆయన జీవితాన్ని, ఆయన ప్రేమను తిరస్కరించినందున, వారొక ఘన కార్యము చేసారని తలంచారు. యేసు తన రక్తాన్ని చిందించడానికే వచ్చారు. తద్వారా ఆయన పాపులను రక్షించగోరారు, గాని వారాయనను తిరస్కరించారు.

తదుపరి కొన్ని దినముల తరువాత పరిశుద్ధాత్మావేశ క్రైస్తవుడొకరు క్రీస్తు రక్తము విషయమై వారు

అపరాధులని చెప్పగా యూదుల పెద్దలు బహుగా కోపపడిరి. “ ఇదిగో ఈ మనుష్యుని హత్య (రక్తము) మా మీదికి తేవలెనని ఉద్దేశించుచున్నారని” వారు ప్రతిఘటించిరి (అపో.కా. 5:28). యిది ఆశ్చర్యకరమైన వేషధారణ! వారికి కావలసినప్పుడు ఆయన మరణముకు తామేబాధ్యులమని ఒప్పుకొన్నారు. అయితే వారికి అవసరం లేనప్పుడు ఆ బాధ్యత మాది కాదన్నారు!

యూదులు, వారి నాయకులు క్రీస్తు రక్తమును సరియైన విధముగా అంగీకరించితే బావుండునని యేసును, ఆయన అపొస్తలులును కాంక్షించారు. ఆయన మరణాన్ని గూర్చి తాము బాధ్యులమని వారు గర్వించుటకంటే, ఆయనను చంపినందున అపరాధులమని ఒప్పుకొని యుంటే నజావుగా యుండును మరియు ఆయన రక్తము ద్వారా తమ అపరాధములనుండి విడుదల పొంది ఆయన రాజ్యములో వారు చేరియుంటే భావుండును.

నీ బైబిలును చదువుము. రక్షకుని గూర్చి వీలైనంత ఎక్కువ తెలిసికొనుము. ఆయన రక్తము ద్వారా ఎట్లు పాపవిముక్తుడవగుదువో తెలిసి కొనుము. అంతట యేసుకు విధేయుడవు కమ్ము!

– మార్క్ మెక్‌హోర్టం

## పరిశుద్ధాత్మ బాప్తిస్మము – నీటి బాప్తిస్మము

“నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షించబడును, నమ్మని వానికి శిక్ష విధించబడును” అని ప్రభువు [illegible] (మార్కు 16:16).

కొందరు బాప్తిస్మము రక్షించునని తాము నమ్ముచున్నట్లు చెప్పుదురు గాని అది పరిశుద్ధాత్మ బాప్తిస్మమందురు. అయితే పైన చెప్పబడిన

బాప్తిస్మము పరిశుద్ధాత్మ బాప్తిస్మము కాదు, గాని నీటి బాప్తిస్మము. బైబిలులో పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన వారు పెక్కుమంది కాదుగాని కొందరే, పన్నెండు మంది అపొస్తలులు, కొర్నేలి యింటివారు మాత్రమే పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 1:1-6; 2:1-5 మరియు అపొ.కా. 11:15 చదువుము)

అపొస్తలులకాలములో సయితము పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఎంత అరుదు అంటే, కొర్నేలీ యింటివారు దానిని పొందినప్పుడు పేతురు సయితము అబ్బురపడ్డాడు. "నేను మాటలాడనారంభించినప్పుడు పరిశుద్ధాత్మ మొదట మన మీదికి దిగిన ప్రకారము వారి మీదికిని దిగెను" అని పేతురు చెప్పాడు (అపొ.కా. 11:15). "మొదట" పెంతెకొస్తు పండుగనాడు అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. అది సంఘము యొక్క ఆరంభదినము, క్రైస్తవ యుగారంభ దినము. పరిశుద్ధాత్మ బాప్తిస్మము సర్వ సాధారణమైన సంగతి అయితే పది సంవత్సరముల తరువాత కొర్నేలి యింటి వారు దానిని పొందగా, మొదట మన మీదికి దిగిన రీతిగా పరిశుద్ధాత్ముడు వారిమీదికిని దిగెనని అపొ. పేతురు ఎందుకు చెబుతాడు.

అపొస్తలులు జీవితకాలములో ఒక ప్రత్యేక ప్రయోజనము కొరకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఉద్దేశించ బడినది. దాని ద్వారా అపొస్తలులు సర్వ సత్యములోనికి నడిపింపబడిరి (యోహాను 16:13). దాని ద్వారా అన్యులు కూడ దేవునికి అంగీకార యోగ్యులే అని యూదులు గ్రహించుకో గలిగిరి. రక్షింపబడు నిమిత్తము ఎవరు ఎన్నడు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొంద లేదు. పరిశుద్ధాత్మ బాప్తిస్తము ఒక ఆజ్ఞకాదు గాని ఒక ప్రత్యేక ప్రయోజనము కొరకు, కొందరికి ప్రత్యేకముగా దేవుడు చేసిన వాగ్దానము (లూకా 24:49; అపొ.కా. 1:4,5). యేసు

క్రీస్తు యిచ్చిన గొప్ప ఆజ్ఞలోని బాప్తిస్మము ఒక ఆజ్ఞ. రక్షింపబడగోరు ప్రతివాడు దానికి లోబడవలెను. అది మారుమనస్సు పొందిన విశ్వాసి నీటిలో పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడే బాప్తిస్మము (అపొ.కా. 2:38). ఏదైనా ఒక సంగతి ఒకే సమయములో వాగ్దానము, ఆజ్ఞ కూడ కానేరదు.

యేసు ఆజ్ఞాపించిన బాప్తిస్మము మనుష్యులు యివ్వాలి. అది నీటి బాప్తిస్మము (అపొ.కా. 8:35-39). మన ప్రభువు ఒక్కడు మాత్రమే పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చువాడు (మత్తయి 3:11; యోహాను 1:33). అది వాగ్దానము, ఆజ్ఞకాదు. అపొ.పౌలు ఎఫెసీయులకు పత్రిక వ్రాయు సరికి పరిశుద్ధాత్మ బాప్తిస్మము నిలిచి పోయెను. అది క్రీ॥శ. 64వ సంవత్సరము. నీటి బాప్తిస్మమును గూర్చి చెబుతు ఉన్న బాప్తిస్మము ఒక్కటే యని అతడు ఉద్ఘాటించాడు (ఎఫెసీ 4:1-6).

- బేసిల్ ఓవర్టన్

# తన సంఘముకు, శరీరముకు, యింటికి, శిరస్సయిన యేసుక్రీస్తు

**పరిచయము :**

1. యేసుక్రీస్తు తన సంఘమునకు శిరస్సుగా లేఖనములు వర్ణించు చున్నవి. ఆయన తన శరీరమునకు, తన యింటికి కూడ శిరస్సయి యున్నారు.

ఎ. సంఘముకు ఆయనకు వున్న సంబంధమును బట్టి ఆయన దానికి శిరస్సయి యున్నారు.

బి. శిరస్సు అను పదము బైబిలును బట్టి యేసుకు ఎట్లు వర్తించునో పరిశీలించుదము.

**యేసుక్రీస్తు తన సంఘమునకు శిరస్సయి యున్నారు :**

ఎ. అపొ.పౌలు దైవిక ప్రేరణ వలన యేసుక్రీస్తు తన సంఘమునకు శిరస్సయి యున్నారని తరచు ప్రత్యేకముగా చెప్పాడు.

1. ఎఫెసీయులకు పౌలు వ్రాసిన పత్రికలో రెండు అధ్యాయములలో యేసుక్రీస్తు తన సంఘమునకు శిరస్సని పౌలు ఉద్ఘాటించాడు (ఎఫెసీ 1:32-33; 5:23).

2. ఎఫెసీ 1:22-23లోను, 5:23లోను సంఘము, శరీరము అను పదములను పర్యాయపదములుగా పౌలు వాడాడు.

3. కొలస్సయులకు వ్రాస్తు పౌలు యేసుక్రీస్తు ఆయన శరీరమైన సంఘమునకు శిరస్సని ఉద్ఘాటించాడు (కొలస్స 1:18).

**బి. యేసుక్రీస్తు మాత్రమే ఆయన సంఘముకు శిరస్సు :**

1. అనగా యేసుక్రీస్తు మాత్రమే సంఘము యొక్క మెదడు, నోరు అయ్యున్నారు.

2. మన ప్రభువు మాత్రమే దాని యొక్క నాయకుడు, రక్షకుడు

3. సంఘములో అత్యున్నత స్థానములో యేసు మాత్రమే యున్నారు.

4. సంఘములో అత్యున్నత స్థానము నాక్రమించువారు యేసు మాత్రమే.

5. యేసు ఒక్కడు మాత్రమే ఆయన సంఘమునకు శిరస్సు గనుక సంఘము యొక్క మార్గ దర్శకత్వము ఆయనే నిర్ణయించును.

సి. యేసు స్థాపించిన సంఘమునకు ఆయన తప్ప భూమి పై శిరస్సుగా ఎవడును లేడు.

**యేసుక్రీస్తు తన ఆత్మీయ శరీరమునకు శిరస్సు :**

ఎ. అపొ. పేతురు యేసుక్రీస్తు తన ఆత్మీయ శరీరమునకు శిరస్సయి యున్నారని విశదముగా, తరుచుగా వ్రాసాడు.

1. అపొ.పౌలు శరీరము, సంఘము

అను పదములను పర్యాయ పదములుగా వాడాడని ఇంతకు ముందే గమనించాము (ఎఫెసీ 1:22,23; 5:23; కొలస్స1:18).

2. ఎఫెసీ 4:15, 16లోను, కొలస్స 2:19లోను సంఘమును అనేక అవయవములుగల శరీరముగా పౌలు వర్ణించాడు, ఆ శరీరమునకు క్రీస్తు శిరస్సయి యున్నారు (1 కొరింధీ 12:21–31; రోమా 12:4,5).

**బి. యేసు ఒక్కడు మాత్రమే ఆయన ఆత్మీయ శరీరమునకు శిరస్సు**

1. అనగా యేసు మాత్రమే దాని మెదడు, నోరు అయ్యున్నారు.
2. మన ప్రభువు మాత్రమే దాని డైరెక్టరు, నాయకుడు
3. యేసుక్రీస్తు తన శరీరములో ముఖ్య స్థానము కలిగియున్నారు.
4. ఆయన శరీరములో యేసు ఒక్కడే అత్యున్నత స్థానములో యుండును.
5. ఆయనే మార్గదర్శకుడు గనుక ఆయనను బట్టియే శరీరము నడిపించబడును.

సి. మరి ఎవడు, ముఖ్యముగా ఏ మానవుడు మన ప్రభువు యొక్క ఆత్మీయ శరీరముకు భూమిమీద శిరస్సుగా లేనేలేడు.

**యేసుక్రీస్తు ఆయన ఆత్మీయ గృహము లేక కుటుంబమునకు శిరస్సయి యున్నారు :**

ఎ. యేసు తన ఆత్మీయ గృహముకు శిరస్సయి యున్నారని అపో.పౌలు విశదీకరించాడు.

1. దేవుని మందిరము, సంఘము అను పదములను పర్యాయ పదములుగా అతడు వాడి యున్నాడు (1తిమో 3:15).
2. దేవుని మందిరవేు దేవుని గృహము.
3. యేసుక్రీస్తు తన యిల్లంతటిపైన యున్నాడని హెబ్రీ లేఖకుడు వ్రాసియున్నాడు (1హెబ్రీ 3:2–6).

**బి. యేసుక్రీస్తు ఒక్కరు మాత్రమే ఆయన ఆత్మీయ గృహము పై శిరస్సుగా యున్నారు.**

1. అనగా ఆ గృహమునకు ఆయనే మెదడు, నోరు.
2. ఆయన ఒక్కడు మాత్రమే దాని నాయకుడు, మార్గదర్శకుడు.
3. తన ఆత్మీయ గృహములో ఆయన మాత్రమే ఘనత వహించును.
4. తన ఆత్మీయ గృహములో యేసు క్రీస్తు శిఖరాగ్రస్థానము కలిగి యున్నారు.

సి. మరియెవరు, ముఖ్యముగా భూమి మీద మరిఎవరు ఆయన గృహమునకు శిరస్సుగా లేనేలేరు.

**'శిరస్సు' అనే ఈ స్థానమును గూర్చి లేఖనాల్లో క్రీస్తును గూర్చి చెప్పబడినవి. తదితరవిషయాల్లో కూడ ఆయనే శిరస్సు :**

ఎ. యేసుక్రీస్తు మూలకు తలరాయి అయ్యెను (కీర్తన 118:22; మత్తయి 21:42, 43; మార్కు 12:10; లూకా 20:17; అపో. 4:11; ఎఫెసీ 2:20; 1పేతురు 2:6,7).

**మూలరాయి :** రెండు గోడలను కలుపు మూలరాయి ఆ రెంటిని కలుపును; మరి ముఖ్యముగా భవనము యొక్క పునాదిలో మూలరాయియే తల (ముఖ్య) రాయి అగును. రాతితో కట్టబడే భవనాలలో ఈ మూలరాయి తగు రీతిగా చెక్కబడుట ద్వారా రెండు గోడలను, తదుపరి భవనము నంతటిని కలుపును, ఏకము చేయును.

1. యూదులు నిరాకరించిన మూల రాయిని గూర్చిన ప్రవచనములో వారు యేసుక్రీస్తును నిరాకరించినా, దేవుడు ఆయననే తలరాయిగా చేసారు (ఆది.కా. 49:24; యెషయా 28:16; రోమా 9:33).
2. సజీవ రాళ్లవలెయున్న క్రైస్తవులతో నిర్మించబడిన ఆత్మీయ గృహము

నకు లేక మందిరమునకు యేసు క్రీస్తు ముఖ్యమైన మూలరాయిగా యున్నారు (1పేతురు 2:5-7).

బి. యేసుక్రీస్తు ప్రతి పురుషునికి శిరస్సుగా యున్నారు (1 కొరింథీ 11:3).

సి. యేసుక్రీస్తు సమస్త ప్రధానుల కును, అధికారులకును శిరస్సై యున్నారు (కొలస్స 2:10).

**ముగింపు :**

1. సంఘము, శరీరము, మందిరము, యిల్లు అనుపదము ఒకే దానిని వర్ణించుటకు వాడబడిన వివిధ పదములు.
2. క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నందున, శరీరము సంఘము ఒక్కటే అయ్యున్నందునను, మన ప్రభువు తన గృహమునకును శిరస్సయి యున్నారు (ఎఫెసీ 1:22, 23).
3. కొలస్స 1:18లో ఈ వివరణ ఇయ్యబడియున్నది.
4. యేసుక్రీస్తు తన ఆత్మీయ గృహమునకు శిరస్సయి యున్నారు.
5. నిస్సందేహముగా యేసుక్రీస్తు తన సంఘమునకు, శరీరమునకు, గృహమునకు శిరస్సయి యున్నారు.

**ఆహ్వానము :**

1. యేసుక్రీస్తు నీ జీవితానికి శిరస్సు కాకపోతే నీవు సువార్తకు లోబడాలి (రోమా 6:17; 2 థెస్స 1:7-9).
2. ఆయనకు విధేయులైన వారికి యేసుక్రీస్తు రక్షకుడైయున్నారు (హెబ్రీ 5:8-10)

---

**మేము ఇచ్చు బైబిలు కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఒక బైబిలు ఉచితముగా పొందండి.**

**సత్యవాణి**
**పోస్ట్‌బాక్స్ నెం.80**
**కాకినాడ - 533 001.**

# సంక్షిప్తవార్తలు

2022 ఆగష్టు 9వ తేదీ రాత్రి జాషువా గూటం దంపతులు, రోనీ గూటం గారి దంపతులు వారి ఇద్దరు కుమార్తెలు ఫియోనా, ఈవా గార్లు కలసి బెంగుళూరు, హాలెండ్ మీదుగా ప్రయాణించి 10వ తేదీ రాత్రికి అమెరికాలోని మెంఫిస్ పట్టణమునకు క్షేమముగా చేరుకొనిరి. 10వ తేదీ రాత్రి రిక్కీ గూటం గారు మద్రాసు, లండన్ మీదుగా పయనించి 11వ తేదీ రాత్రికి అమెరికా చేరుకొనిరి. ఇండియా నుండి అమెరికా వరకు దేవుడనుగ్రహించిన క్షేమకర ప్రయాణమునకు ఆయనకు స్తోత్రములు.

2022 ఆగష్టు 17-25 తేదీలలో అమెరికాలో టెన్నీసీ రాష్ట్రములో సివియర్‌విల్ అనే మహానగర ప్రాంతములో ఏటేటా జరుగు పాలిషింగ్ ద పుల్‌పిట్ అను క్రీస్తుసంఘ మహాసభలలో పైనుదహరించిన వారందరు పాల్గొనిరి. ఈ సభలకు అమెరికా అంతటి నుండి ప్రతియేటా 7-8 వేల మంది హాజరవుదురు. ప్రఖ్యాతిగాంచిన సువార్తికులు దేవుని గ్రంధము నుండి రోజంతా వాక్యమును విశ్లేషింతురు. 21వ తేదీ ఆదివారం ఇంచుమించు 8 వేలమంది ఆరాధనలో పాల్గొనిరి. అంతమంది క్రీస్తుసంఘస్థులు ఒకేచోట కూడుకొని దేవుని ఆరాధించడం ఆయారాధనలో పాల్గొనడం గొప్ప ఆత్మీయ అనుభూతి.

2022 ఆగష్టు 24వ తేదీ ఆఖరి సభలో పాలిషింగ్ ద పుల్‌పిట్ నిర్వాహకులు అన్నివేల మంది ఎదుట రోనీగూటం గారిని సత్కరించి, అభినందన సర్టిఫికేట్‌ను అందజేసిరి. సభికులు అందరూ ఆశ్చర్యపడుచు రోనీగూటం గారిని అభినందించిరి. ఆ సభలో భారతదేశం నుండి వచ్చిన జాన్‌డీన్, డేవిడ్‌మార్టిన్ మరియు ఇద్దరు ముగ్గురు సహోదరులు కూడా యుండిరి. ఆ సభలకు ఇంచుమించు 7-8 దేశముల నుండి వచ్చిన వారుండిరి.

2022 ఆగష్టు 14వ తేదీ ఆదివారం పైనుదహరించిన వారందరు ఫ్రీడ్ హార్డియన్ యూనివర్సిటీకి సమీపములో యున్న రెండు క్రీస్తుసంఘములలో ఆరాధనలో పాల్గొనిరి. ఆ సాయంత్రం హెండర్సన్ క్రీస్తుసంఘ ఆరాధనలో వెయ్యిమంది హాజరుకాగా రిక్కీగూటం గారు క్లుప్తప్రసంగము చేయగా అందరు సంతోషించి ఆయనను అభినందించిరి. మరియు సెప్టెంబరు 12వ తేదీనాడు మరలవచ్చి ఆ యూనివర్సిటీలో చదువుచున్నట్టియు, ఆ స్థానిక సంఘములో యున్నట్టియు వేలాదిమంది యువతీయువకులకు వాక్యపరిచర్యచేయమని కోరగా రిక్కీగూటం గారు అందుకు అంగీకరించిరి.

మరుసటి ఆదివారం మిస్సిసిపేలో ఇండిపెండిన్సులో యున్న క్రీస్తుసంఘములో బైబిలు క్లాసులో రోనీగూటం గారును, ఆరాధనలో జాషువాగూటం గారును వాక్యపరిచర్యచేసిరి. అదేసమయంలో రిక్కీ గూటం గారు ఓక్లహోమాలో యున్న రెండు మూడు సంఘములలో వాక్యపరిచర్య చేసిరి.

ఆగష్టు 22వ తేదీ నుండి సత్యవాణి స్కూల్ ఆఫ్ ఇవాంజలిజమ్‌లో ప్రవక్తలను గూర్చిన క్లాసులు ప్రారంభమైనవి. అవి ఆన్‌లైన్‌లో జరుగుచున్నవి గనుక భారతదేశంలో పలుప్రాంతములలోయున్నవారు సత్యవాక్యమును నేర్చుకొనుచున్నారు. ఆసక్తిగలవారు 98489 98547కు ఫోన్‌చేసి వివరములు తెలిసికొనగలరు. ఈ పాఠములను మీరు యూట్యూబ్‌లో కూడ వీక్షించవచ్చును. సంఘసంబంధమైన అవుసరములకొరకు, బైబిలు పాఠములకొరకు రాబిన్ గూటం గారిని సంప్రదించగలరు. సెప్టెంబరు 3వ వారంతమునకు రిక్కీ గారు కాకినాడ చేరుకొనగలరు.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2021-2023**

**సత్యవాక్కు**
పోస్టుబాక్సు - 80
కాకినాడ - 533001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేది : ప్రతీ నెల 9వ తేదీ
పోస్టు చేయు తేదీ : ప్రతీ నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్, ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ - 533004